# వెలుగు నీడలు

—రచన : శ్రీ రేగులపాటి కిషన్ రావు.

కుంభవర్షం కురిసి వెలిసింది. రాక్షసి బొగ్గులాంటి నల్లని మేఘాలు ఆకాశవీధిలో నలుదిశలా చెదరిపోయాయి. అంతవరకు మేఘాల చెరసాలలో బంధించబడిన శశాంకుడు బంధవిముక్తుడై బయటపడ్డాడు.

నెలరేడు తన చల్లని వెన్నెలను మిద్దెలపైనా, మేడలపైనా, పూరి గుడిసెలపైనా సమానంగా వెదజల్లుతున్నాడు.

కుంభవర్షంలో చల్లబడిపోయిన గాలి పిల్లవాడు వెచ్చని ప్రదేశం కోసం వెదకుతూ పోతున్నాడు. తలుపులు తడుతున్నాడు, కిటికీలు కొడుతున్నాడు. కానీ అవి తెరుచుకోకపోవడంవల్ల, శాంతినగర్‌లో వున్న రంగయ్య రంధ్రాల గుడిసెలో చొరబడ్డాడు.

కునికిపాట్లు పడుతున్న రంగయ్యను గాలి పిల్లవాడు ఆలింగనం చేసుకోవడంతో అతని నిద్రమత్తు ఎగిరిపోయింది.

అతని భార్య కాంత-టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతూ ఓ మూలకు ఒదిగి పడుకొంది. ఆమె శరీరానికి శీతలవాయువు తాకగానే గజగజ వణుకుతూ మూల్గసాగింది. ఆమె ఆ జ్వరంతో పది దినాలనుండి బాధపడుతూనే వుంది.

అతని కుమారుడు గోపాలం వానచినుకులచే తడిసిన చినిగిన దుప్పటిని కప్పుకోలేక వణుకుతూ ముడుచుకొని పడుకొన్నాడు.

అతని కూతురు సుజాత, చినిగిపోయిన గొంగడి కప్పుకొని పడుకుంది.

పసివాడు పాలకోసం ఏడుస్తున్నాడు.

బీదవారికి నేనే గడియారమన్నట్టు ఎనిమిది సంవత్సరాల ముసలి కోడిపుంజు బలహీనంగా విధిగా కూసింది. చలిచే వణుకుతూ పడుకున్న రంగయ్య లేచి కూర్చున్నాడు. బాధపడుతున్న భార్యను, పిల్లలను చూచి నిట్టూర్పు విడిచాడు. గేటుకడ్డంగా వున్న తడకను పక్కకు జరిపి, బయటకువచ్చాడు. పైకప్పులేని నల్లని గోడలు కన్పించగానే అతని కళ్ళు చెమర్చాయి. పంచెతో కళ్ళు తుడుచుకొని రిక్షా ఎక్కాడు. పది నిమిషాల్లో రైల్వేస్టేషను వద్దకు చేరాడు.

కొంటె కోటయ్య, బక్క బాలయ్య, సోమరి సత్తయ్య కన్పించారతనికి. వాళ్ళు రిక్షాలపై కూర్చుండి బీడీలు త్రాగుతూ పొగ వదలుతున్నారు.

రంగయ్యను చూడగానే కోటయ్యకు ఓ కొంటె ఆలోచన వచ్చింది. వెంటనే అతడు రంగయ్య దగ్గరకు వచ్చి "లక్షాధికారి రంగయ్యగారా, రండిసార్ రండీ! నా రిక్షాలో ఎక్కండి సార్ మీ మేడవద్ద తీసుకపోతాను. నాకూ ఎక్కువ ఇవ్వనవసరంలేదు సార్. అర్ధరూపాయి పడేయ్యండి చాలు" అంటూ హేళన చేశాడు.

రంగయ్యకు కోపం పొంగులా వచ్చింది. కాని ఎలాగో నిగ్రహించుకున్నాడు. తక్షణమే అతని కనుకోయినుండి కన్నీటి చుక్కలు బయటపడ్డాయి. అతని ఆలోచనలు గతంలోకి తొంగిచూశాయి.

* * *

శివరామయ్య పొగాకు వ్యాపారంచేసి అందులో వచ్చిన లాభాలతో పట్నంలో మేడ కొనుక్కున్నాడని తెలిసిన తర్వాత రంగయ్యకు పొగాకు వ్యాపారం చేయాలన్న ఆలోచన వచ్చింది. వెంటనే ఇల్లు పొలాలు అమ్మేసి పట్నం చేరుకున్నాడు. 50 వేల రూపాయలతో బంగ్లా కొన్నాడు. మిగిలిన డబ్బుతో పొగాకు వ్యాపారం ప్రారంభించాడు.

ఆ వ్యాపారం మూడు ఆకులు ఆరు రూకలుగా అభివృద్ధి చెందింది. కాని అంతలోనే రెండు విషాద సంఘటనలు జరిగాయి. ఒకటి అతని రెండవ కొడుకు కారు

ప్రమాదంలో చనిపోవడం, రెండవది పదివేల రూపాయలున్న బ్యాగు ఎక్కడో మరచిపోవడం.

ఆ తర్వాత రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. కాలం కన్నీటిని తుడిచివేసింది.

వ్యాపారం రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ వుంది. పిల్లలు శ్రద్ధగా చదువుకొంటున్నారు. సినిమాలతో, షికార్లతో జీవితం హాయిగా ఆనందంగా గడిచిపోతూ వుంది.

ఒకరోజు అతడు భార్యాబిడ్డలతో సినిమాకు వెళ్ళాడు. ఆ వినోద సమయములో ఓ విషాదవార్త అతని చెవిలో పడింది. అది అతని మేడకు నిప్పంటుకుందన్న భయంకర సత్యం!

మేడ చెంతకు చేరుకునేసరికి గోడలు మాత్రం మిగిలివున్నాయి. అతని కళ్ళు చెరువులయ్యాయి!

అప్పటికి శాంత ఆరునెలల గర్భవతి.


నిలువ నీడలేక, మింగ మెతుకులేక భార్యాబిడ్డలతో బాధలలో కూరుకపోయాడతను.

జేబులో దక్కిపోయిన ఆరువందల రూపాయలతో కాలిన మేడ ప్రక్కన గుడిసె వేసుకున్నాడు. రిక్షా కొనుక్కున్నాడు. కొద్దిరోజుల్లోనే రిక్షా రంగయ్యగా మారిపోయాడు.

* * *


రైలు చప్పుడు వినబడగానే రంగయ్య ఆలోచనలు ఎగిరిపోయాయి! గేటుదాటి చాలామంది వస్తున్నారు, రిక్షాలెక్కి పోతున్నారు. అతడు చెమర్చిన కళ్ళను తుడుచుకుంటుండగా మక్కల బస్తాలావున్న ఒక వ్యక్తి రిక్షా వద్దకు వచ్చాడు. బేరం కుదిరిన తర్వాత రిక్షా ఎక్కాడు. అప్పుడు ఆ రిక్షా టైర్లు అమ్మబాబోయ్ అన్నట్లు అణిగిపోయాయి. రిక్షా భారంగా కదులుతూ వుంటే రంగయ్య బుర్రలోకి అనేక ఆలోచనలు రాసాగాయి...


KAMAL



★ Single Phase Motors ★
★ Monoblock Pumpsets
★ Centripetal Pumps
★ Domestic Pumps

MAKE YOUR JOB ESIER AND PLEASURABLE WITH



WETGRINDERS
FOR GRINDING RICE, DHAL AND MASALA ETC.,

--: Manufacturers :-- Phone : 25426

KAMALA INDUSTRIES

5, Senganur Road : : COIMBATORE - 641 027.

శాంత పది రోజులనుండి టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతూ వుంది! పసిపాప పాలకోరకు ఏడుస్తూ వుంది!

అతను రోజుకు నాలుగైదు రూపాయల కంటే ఎక్కువ సంపాదించలేడు! ఆ కొద్ది డబ్బుతో అయిదుగురి ఆకలి తీర్చాలి! ఇక మిగిలేదేమిటి? శాంత జబ్బుకు మందులు ఎలా కొనగలడు? ముసలిదశలోవున్న గుడిసెను ఎలా బాగుచేయించుకోగలడు?

ఈ లోకంలో డబ్బు కున్నంత విలువ దేనికీ లేదు. చేతిలో డబ్బున్నప్పుడు ఎన్నో సుఖాలనుభవించాడు తను. మేడలో నివాసం, కమ్మనితిండి, వాలు కుర్చీలు, మెత్తని మంచాలు, విలువైన రేడియో, ఫోన్, ఫోన్... తనను ఆశ్రయించి ఎందరో బ్రతికేవారు! తన చుట్టు ఎందరో తిరిగేవారు, అందరూ తనను గౌరవించేవారు.

మేడ బూడిదయ్యాక స్నేహితులు దూరమయ్యారు. పరపతి పారిపోయింది! తెలివికి విలువపోయింది! భార్యకు జబ్బుచేస్తే మందులు ఇప్పించలేని దరిద్రంలో వున్నాడు తను! రిక్షాలెక్కి తిరిగిన తను రిక్షా తొక్కేవాడయ్యాడు! ఎంత మార్పు...

"ఆపు" అన్న శబ్దం విని రిక్షా ఆపాడు రంగయ్య.

మక్కాలబస్తాగారు దిగగానే రిక్షా టైర్లుకి ఊపిరి ఆడుతున్నట్టు చక్కగా నిలబడ్డాయి మక్కాలబస్తా జేబులోనుండి పైసలుతీసి రంగయ్య చేతిలో పెట్టి భారంగా అడుగులు వేస్తూ కదలిపోయాడు.

రంగయ్య హోటల్లో నలభైపైసల పాలు గ్లాసులో పోయించుకొని తన రంధ్రాల గుడిసెవైపు బయలు దేరాడు!

* * *

"రిక్షా కావాలా సార్" అన్నాడు ఒకతను.

అవునన్నట్టు తలవూపాడు రఘురామయ్య. రిక్షా అతని పక్కకువచ్చి ఆగింది! బేరం కుదిరిన తర్వాత అతడు రిక్షా ఎక్కాడు! రిక్షా నడుస్తుండగా క్యాష్ బ్యాగును పక్కకు పెట్టబోయి హఠాత్తుగా ఏదో జ్ఞప్తికి ఆగిపోయాడు! బ్యాగును మోకాళ్ళపై పెట్టుకొని మరింత గట్టిగా పట్టుకున్నాడు.

'ఎవరో పాపం మతిమరుపులవాడు! పదివేల రూపాయలున్న బ్యాగు మరిచిపోయాడు, ఎంత

కె. పి. జి. వారి అపూర్వ కానుక!!

* రాజు ఇజిప్షిన్ * టిప్‌టాప్ ప్లైన్.
* గోరా ఇజిప్షిన్ * చిల్డ్రిన్
* గోల్డన్ డాలర్ * కె. పి. జి. ఇంటర్‌లాక్
మరియు ఇతర రకాలకు ప్రసిద్ధి చెందిన పేరు

"కె. పి. జి."

తయారించువారు :

K. P. G. Knitting Co.
4/2, Harvey Road : : TIRUPUR-638602

ఏడ్చాడో' అనుకున్నాడు మనసులో. అతని ఆలోచనలు గతంలోకి వెళ్ళిపోయాయి...

గాంధీనగర్‌లో దాదాపు అన్నీ పూరిగుడిసెలే! అందులో పోచయ్యది ఈతకమ్మల గుడిసె.

అతడు రిక్షా తొక్కి డబ్బు సంపాదించి అశక్తులైన తల్లిదండ్రులను భార్యా బిడ్డలను పోషించేవాడు!

అతడొకనాడు రైల్వేస్టేషనువద్ద రిక్షాలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు! అంతలో రైలు వచ్చింది! చాలామంది రిక్షావాళ్ళు ప్రయాణికులను ఎక్కించుకొని గంటలు మ్రోగిస్తూ వెళ్ళిపోతున్నారు.

క్యాష్‌బ్యాగు పట్టుకొని పరధ్యానంగా నడచివస్తున్న వ్యక్తిని చూచి 'రిక్షా కావాలా సార్' అన్నాడు పోచయ్య.

అవునన్నట్టు తలవూపాడా వ్యక్తి! అతడు ఆకారంలో భీమునిలా వున్నాడు.

"జవహర్‌నగర్ పోవాలి! ఎంత తీసుకుంటావ్" అన్నాడు భీముడు.

"రూపాయిన్నర ఇవ్వండి!"

"రూపాయి యిస్తాను తీసుకపో!"

"రూపాయిపావలా ఇవ్వండి సార్!"

"నీ ఇష్టముంటే రూపాయికి తీసుకపో, లేకపోతే లేదు!"

"సరే ఎక్కండి!"

* * *

పోచయ్య రిక్షాను ఇంటిముందు నిలిపి ఇంట్లోకి అడుగు వేస్తుండగా, ఇంటిముందు గద్దెమీద కూర్చున్న అతని తల్లి అంది.

"పోచా, రిక్షాలో అదేమిటో మరిచిపోయే వస్తున్నావేమిట్రా!"

పోచయ్య రిక్షావైపు తిరిగి చూశాడు. అతనికి ఆశ్చర్యం వేసింది. అందులో క్యాష్‌బ్యాగు వుంది! ఎవరిదది? పోచయ్య ఆలోచించాడు! "నీ ఇష్టముంటే రూపాయికి తీసుకపో! లేకపోతేలేదు!" అన్న భీముని మాటలు జ్ఞప్తికి వచ్చాయి. అతడు గబగబా రిక్షా దగ్గరకు వచ్చాడు. వీధివైపు చూశాడు. ఇటువైపు ఎవరూ చూడడంలేదని గమనించి గబుక్కున క్యాష్ బ్యాగు పట్టుకొని చటుక్కున ఇంట్లోకి వెళ్ళిపోయాడు! అతని తల్లి కొత్తగా ఆశ్చర్యపోతూ అతని వెంట ఇంట్లోకి నడచి తలుపులు మూసింది!

క్యాష్‌బ్యాగు తెరచి చూచి ఆశ్చర్యపోయారు తల్లీ కొడుకులు. దానినిండా నోట్లకట్టలే!


ఈ క్యాష్‌బ్యాగు పోయినందుకు భీముడు ఎంత బాధ పడుతున్నాడో, అయినా ఇంత మతిమరుపా? పోచయ్యకు భీమునిపై రవ్వంత జాలివేసింది!

అంతడబ్బు ఒక్కసారి చూసేసరికి అతనికి సంతోషం ఆశ్చర్యంతోపాటు భీముడు ఆచూకీ తీసి తనను పట్టుకొని డబ్బులు తీసుకుపోతాడేమోనన్న అనుమానం, జంకు కూడా కలిగాయి.

అయినా చిరునామా తెలియకుండా వేలాది రిక్షాలు నడుస్తున్న ఈ మహా పట్టణంలో భీముడు తన ఇంటికి ఎలా రాగలడు? ఎలాగో వస్తే దర్జాగా అతని క్యాష్ బ్యాగు అతనికి ఇవ్వచ్చు లేదా...ఇలా ఆలోచించిన అతడు ఆ రోజు ఇల్లువదలి బయటకురాలేదు. సాయంత్రం నాలుగు...అయిదు...ఆరు గంటలు గడిచాయి! చీకటి వచ్చింది! రాత్రి అయింది! పట్నం నిద్రపోయింది! తెల్లవారింది! వెలుగు వచ్చింది! మళ్ళీ వీధుల్లో ధ్వనులు, ధ్వనులు!

చిరకాల మన్నిక – అతిప్రకాశవంతమైనది – నవీన పనితనము!

# నోవెల్ వజ్రములు




నగలను అలంకరించుటకు,
విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.
అన్ని విధములైన కలర్ కమలములూ
మా వద్ద దొరుకును.
మా వజ్రములకు గ్యారంటి ఇవ్వబడును.

: తయారుచేయువారు :

Phone No. 27468

# Novel Diamond Works

WEST RANI STREET, : : TIRUCHIRAPALLI-620 008.

పోచయ్య ఇంటి ముందుకువచ్చి నిలబడ్డాడు. రిక్షాలు...కార్లు...సిటీబస్సులు... వీధుల్లో వస్తున్నాయి; పోతున్నాయి. వేలాదిమంది ప్రజలు హడావిడిగా అటూ ఇటూ వస్తున్నారు, పోతున్నారు. అతని కళ్ళు పరిసరాలను చూస్తున్నాయి, మనసు ఆలోచిస్తోంది.

* * *

స్వగ్రామంలో కూలి పనులు సరిగా దొరక్క పది, సంవత్సరాల క్రితం పట్నం చేరాడు పోచయ్య. అతనికి ఈ రోజున పట్నం వదలి స్వగ్రామం చేరుకోవాలన్న ఆలోచన వచ్చింది.

అతడు స్వగ్రామంచేరి వ్యాపారం ప్రారంభించాడు. అతని దుకాణం చూచి చాలామంది ఆశ్చర్యపోయారు! బస్తీలో రిక్షా తొక్కి పది సంవత్సరాల్లోనే ఇంత డబ్బు సంపాదించగలిగాడే అన్నది వాళ్ళ ఆశ్చర్యానికి హేతువు.

పూర్వం అతనిని చులకనగా చూచినవాళ్ళు సైతం గౌరవించడం ప్రారంభించారు.

ఒకనాడు ఆ గ్రామసర్పంచ్ పోచయ్య దుకాణానికి వచ్చాడు! పోచయ్య కుర్చీచూపించి కూర్చోమన్నాడు! అతడు కుర్చీలో కూర్చుంటూ "అన్నట్టు నీ పేరు రఘురామయ్య కదూ!" అన్నాడు నవ్వుతూ.

"కాదండి! నా పేరు పోచయ్య!"

"పోచయ్యనా! నేను మరిచేపోయాను సుమా! ఆదేదో కథలో కూలీకోసం బస్తీకి వెళ్ళిన రఘురామయ్యకు లాట్రీలో లక్ష రూపాయలు వచ్చాయి. రఘురామయ్య లాగా నువ్వు కూడా అదృష్టవంతుడవు కనుకనే పది సంవత్సరాల్లో యింత పెద్ద దుకాణం పెట్టగలిగేంత డబ్బు సంపాదించావు! నువ్వు నిజంగా రఘురామయ్యవే!"

పోచయ్యకు సర్పంచు పెట్టిన రఘురామయ్య అన్న పేరే స్థిరపడిపోయింది!

వ్యాపారం అభివృద్ధి చెందుతుండగా అయిదు సంవత్సరాలు కాలగర్భములో కలిసిపోయాయి.

* * *

రిక్షా ఆగింది! రఘురామయ్య రిక్షావాడికి డబ్బు ఇచ్చి, క్యాష్‌బ్యాగు పట్టుకొని నడవసాగాడు! ఆ వీధి మలుపు దాటి ఉత్తరంవైపున వున్న వీధిలోకి వచ్చాడు. ఆ వీధిలో వేపచెట్టు దగ్గర చాలామంది గుమిగూడి వున్నారు. పోలీసువాళ్ళు వారిని అటకాయిస్తూ కేకలు వేస్తున్నారు.

రఘురామయ్య ఆ గుంపు దగ్గరకు వచ్చి తొంగిచూచి తృళ్ళిపడ్డాడు.

అయిదు సంవత్సరాల క్రితం తన రిక్షాలో క్యాష్ బ్యాగ్ మరచిపోయిన వ్యక్తి అతడు! అతని కడుపు చితికిపోయి రక్తం మడుగుకట్టింది! అతని భార్యా పిల్లలు ప్రక్కన కూర్చుని ఏడుస్తున్నారు.

అతడు రిక్షా తొక్కుతూ ఇంటివైపు వెళ్తుండగా కారు ఢీకొని చనిపోయాడని తెలిసింది.

అక్కడ గుమిగూడిన రిక్షావాళ్ళు చనిపోయిన వ్యక్తి జీవితచరిత్ర వాళ్ళకు చెప్పుతూవుంటే రఘురామయ్యకూడా కుతూహలంగా విన్నాడు. అతని భార్యా పిల్లలు దీనంగా ఏడుస్తూవుంటే రఘురామయ్యకు కాస్త జాలివేసింది!

"ఆ వ్యక్తి పోగొట్టుకున్న డబ్బుతో తను ధనవంతుడయ్యాడు! తనీ సమయములో అతని కుటుంబ సభ్యులకు డబ్బు రూపంలో కొంతమాత్రమైనా సహాయం చెయ్యాలి! ఇలా ఆలోచించి క్యాష్‌బ్యాగు తెరిచాడు! రూపాయల నోట్ల సైజులో తెల్లని కాగితాల కట్టలు బ్యాగునిండా వున్నాయి.

బస్సులోనో, హోటల్లోనో ఎక్కడోగానీ ఎవరో అతని క్యాష్‌బ్యాగు కాజేసి దాని స్థానంలో అలాంటి క్యాష్‌బ్యాగే పెట్టిపోయారు.

చితికిపోయిన భీమయ్య (రంగయ్య) శవాన్ని చూచినప్పుడు కూడా రఘురామయ్య కళ్ళు చెమర్చలేదు. కానీ బ్యాగులో రూపాయల కట్టలకు బదులు తెల్లకాగితాల కట్టలుండడం చూచినప్పుడు మాత్రం ఆ కళ్ళు చెరువులే అయ్యాయి.

